క్లుప్తంగా

3,235 కిలోల దీపావళి సామగ్రి సీజ్

రాజమహేంద్రవరం రూరల్: లైసెన్సుకు మించి దీపావళి సామగ్రిని నిల్వ ఉంచిన విజయలక్ష్మి ఫైర్ వర్క్స్‌కు చెందిన సేల్‌పాయింట్, గొడౌన్‌లోని 3,235 కిలోల దీపావళి సామగ్రిని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై ప్రియాకుమార్ శుక్రవారం సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నామవరం రోడ్డులో మామిడిపల్లి రామకృష్ణ విజయలక్ష్మీఫైర్ వర్క్స్ సేల్స్ పాయింట్‌ను నిర్వహిస్తున్నారు. అయితే సేల్స్ పాయింట్‌కు సంబంధించి 1500 కిలోల దీపావళి సామగ్రి మాత్రమే నిల్వ ఉంచేందుకు లైసెన్సు ఉంది. అయితే సంబంధిత గొడౌన్‌లో లైసెన్సుకు ఉండాల్సిన నిల్వల కంటే అదనంగా 3,235 కిలోల దీపావళి సామగ్రి ఉన్నట్టు పోలీసులు తనిఖీల్లో తేలింది. దీంతో ఎస్సై ప్రియాకుమార్ కేసు నమోదు చేసి 3,235 కిలోల దీపావళి సామగ్రిని గొడౌన్‌లోనే ఉంచి సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రియాకుమార్ తెలిపారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే



మీ భద్రత మా బాధ్యత కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యతనిస్తూ వారికి అండగా నిలబడుతుందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ‘మీ భద్రత మా బాధ్యత’ కార్యక్రమంలో స్థానిక నాయకులు అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించి మహిళా రక్షక్ అనే నూతన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆవిష్కరించారు. మహిళలు బాలికల రక్షణ కోసం జిల్లా పోలీసు అందుబాటులో పర్యవేక్షిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యాక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 75 దరఖాస్తులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో మద్యం దుకాణాలకు శుక్రవారం 75 దరఖాస్తులు ఆఫ్ లైన్‌లో వచ్చినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్య తెలిపారు. ఇప్పటివరకూ జిల్లాలో 125 మద్యం దుకాణాలకు 85 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలోపు ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

విజయనగరంలో ఏపీటీఎఫ్ 80 వసంతాల సభ



ఏపీటీఎఫ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ 80 వసంతాల సభకు హాజరు కావలసిందిగా ఆహ్వాన పత్రాన్ని జిల్లా డీఎస్‌ఈవో కె.వాసుదేవరావుకు జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అందజేశారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్, రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం, మాజీ కార్యదర్శి, గౌరవ అధ్యక్షుడు వి.అప్పయ్య శాస్త్రి, నగరశాఖ అధ్యక్షులు తాతారావు, ప్రధాన కార్యదర్శి ఎస్ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల:	దేవర
సూర్యమినీ:	దక్షిణ
సూర్యప్యాలెస్:	దేవర
శివజ్యోతి:	రామ్‌నగర్‌బన్నీ
అనుశ్రీ:	స్వాగ్
స్వామి:	జోకర్
అశోక:	దేవర
రాజా:	దేవర
రంభ:	కలి
ఊర్వశి:	సత్యం సుందరం
మేనక:	మత్తు వదలరా-2, మిస్టర్‌సెలబ్రిటీ
కుమారి:	దేవర
అప్సర:	దేవర
నామవరం	
విఎస్.మహల్:	దేవర
ధవళేశ్వరం	
మురళీకృష్ణ:	దేవర
కడియం	
వెంకటసూర్య:	దేవర

పతకాల పంట

- రాష్ట్ర, జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్‌లో రాణిస్తున్న క్రీడాకారులు
- పలు విభాగాల్లో పతకాలు సాధించిన విద్యార్థులు



టీటీ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు భాస్కర్ రామ్

ప్రకాశం నగర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. ఎంతో కృషి చేస్తూ తమ సత్తా చాటుతున్నారు. ఇటీవల విద్యార్థులు టేబుల్ టెన్నిస్‌పై ఆసక్తి చూపుతున్నారు. టేబుల్ టెన్నిస్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలను సాధించడమే కాకుండా జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన సూరపురెడ్డి త్రిషాల్ రాజ్‌కుమార్ హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన నేషనల్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్-15 విభాగంలో వెండి పతకం సాధించాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఘనత సాధించిన మొట్టమొదటి క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించాడు. అలాగే ఈ నెల ఐదో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు లడక్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే 19వ జాతీయ స్థాయి టీటీ పోటీలకు జి.నమన్ జైన్, బి.జోషిత్, ఎల్.సాకేత్ బాలురు విభాగంలో ఎంపికయ్యారు. వీరు గత మాసం విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అకాడమికి చెందిన మరో క్రీడాకారిణి జి.సిరి పావని కోల్‌కత్తాలో జరిగిన ఆల్ ఇండియా టీటీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది.

రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి పోటీలు

ఇటీవల రాజమహేంద్రవరంలో రెండో ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ నగరాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడ్డారు. సుమారు మూడు రోజుల పాటు నగరంలో జరిగిన పోటీల్లో పది టేబుల్స్‌పై 25 మంది ఎంపైరింగ్ సిబ్బందితో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులతో పాటు మెడల్స్‌ను అందజేశారు. వీరిలో నగరానికి చెందిన శ్రీ మోహిత్ అండర్-11 విభాగంలో బ్రాంజి మెడల్‌ను సొంతం చేసుకున్నాడు.

పలువురి అభినందనలు

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నీస్‌లో పతకాలు సాధించిన గౌతమి టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విశ్వానాథ భాస్కర్ రామ్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె. సత్యనారాయణ, కోచ్ వీటీవీ సుబ్బారావు అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.



జాతీయ టీటీ పోటీల్లో వెండి పతకం సాధించిన త్రిషాల్ కుమార్

ఆనందంగా ఉంది



లడక్‌లో జరిగే జాతీయ స్థాయి టీటీ పోటీలకు ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. గౌతమి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌లో వీటీవీ సుబ్బారావు మంచి శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయలు సాధించి, జాతీయ స్థాయి టీటీలో రాణించడమే ధ్యేయంగా శిక్షణ తీసుకుంటున్నాను.

– జి. సిరి పావని

బాధితులకు సాయం అందజేత



అగ్ని బాధితులకు సాయం అందజేస్తున్న గిరజాల వీర్రాజు తదితరులు

కడియం: మండల కేంద్రమైన కడియం నుంచి వేమగిరి వెళ్లే కెనాల్ రోడ్డులో నివాసం ఉంటున్న నరగ్రీ కూలీ కె.రమణ, కె.ప్రభాకరరావులకు చెందిన తాటాకిల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదలలో బాధితులు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకుని బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి, బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గిరజాల వీర్రాజు (బాబు) వారిని శుక్రవారం పరామర్శించారు. బాధితులకు నిత్యాసవర వస్తువులు, వంట సామగ్రి, నగదు సాయాన్ని అందజేశారు. పార్టీ నాయకులు సర్కార్‌బాషా వెయ్యిరూపాయలు నగదు సాయం కూడా అందజేసారు. ఈ కార్యక్రమంలో కుసునూరి బాబులు, పిండి మూర్తి, దంగుడు బియ్యం సుబ్బారావు, సిరంశెట్టి మూర్తి, మలకల దొరబాబు, మైపాల వాసు, బొమ్మిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అధికారులు



మండలరెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ప్రసాద్



విధుల్లో చేరిన ఈవోపీఆర్‌అండ్ఆర్డీ ఆరమ్‌స్ట్రాంగ్

రాజమహేంద్రవరం రూరల్: బదిలీపై వచ్చిన మండలంలో వివిధ హోదాలలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కంతంరెడ్డి వెంకట శ్రీనివాస్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ప్రసాద్ ఇన్‌చార్జి తహసీల్దార్‌ను రమ్యను మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. ఎంఆర్‌ఐ ప్రసాద్‌ను కార్యాలయం సిబ్బంది, వీఆర్‌వోలు అభినందించారు.

ఈవోపీఆర్ అండ్ ఆర్డీగా ఆరమ్‌స్ట్రాంగ్..

మండల ఈవోపీఆర్ అండ్ ఆర్డీగా పి.సునీల్ ఆరమ్‌స్ట్రాంగ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణా జిల్లా గంపలగూడెం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్టును అందజేశారు. ఆయనను పలువురు పంచాయతీ కార్యదర్శులు కలిసి అభినందించారు. ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శిగా గుంట్రు వెంకటరావు, పిడింగొయ్యి పంచాయతీ కార్యదర్శిగా డి.సూర్యనారాయణ, హుకుంపేట పంచాయతీ కార్యదర్శిగా కేవీఎస్‌ఎస్‌ఎన్ రాజశేఖర్, కాతేరు పంచాయతీ కార్యదర్శి పి.రాధాకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. జాయినింగ్ రిపోర్టును ఎంపీడీవో డి.శ్రీనివాసరావుకు అందజేశారు. కాతేరు గ్రామ సచివాలయం-4 ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా ఎండీ హబీబ్‌అర్‌రహమాన్, హుకుంపేట గ్రామసచివాలయం-3 ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పి.రాజేష్, కాతేరు గ్రామ సచివాలయం-3 ఇంజనీరింగ్ అసిస్టెంట్ బూరవిజయ కిరణ్, కాతేరు గ్రామ సచివాలయం-5 ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా వై.మానస బాధ్యతలు స్వీకరించారు. బొమ్మూరు గ్రామ సచివాలయం-4 డిజిటల్ అసిస్టెంట్ ఎం.అమూల్య, బొమ్మూరు గ్రామ సచివాలయం-1 డిజిటల్ అసిస్టెంట్‌గా జి.ఈతిష, బొమ్మూరు గ్రామ సచివాలయం-2 గ్రేడ్-5 సెక్రటరీగా ఎం.పవన్‌కుమార్ బాధ్యతలను తీసుకున్నారు. ముందుగా ఎంపీడీవో డి.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్టును అందజేశారు.

కొనసాగుతున్న సత్యసాయి డ్రింకింగ్ వర్కర్స్ సమ్మె



ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న సత్యసాయి డ్రింకింగ్ ప్రాజెక్టు వర్కర్లు

రాజమహంద్రవరం రూరల్: పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలంటూ లాలాచెరువులోని ఆర్ డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి, మెయింటెనెన్స్ వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టమూరి వీరబాబు, యు.ఇస్సాక్ మాట్లాడుతూ కార్మికులకు జీతాలు ఇవ్వకపోయినా పని చేస్తూ వచ్చామన్నారు. కానీ జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరారు. దీనిపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మెలో యూనియన్‌నేతలు పాలాడి శ్రీనివాస్, ఇజ్జన శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంలో వాటర్ ఫౌంటైన్



పనిచేయని వాటర్ ఫౌంటైన్

- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరాన్ని సుందర నగరంగా తీర్చిందుకు చేపట్టిన చర్యల్లో నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం కారణంగా లక్షలాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో మూన్నాళ్ల ముచ్చటగా మారిపోయింది. నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అప్పటి ఎంపీ మార్గాని భరత్‌రామ్ నేతృత్వంలో గోరక్షణ పేట నుంచి ఏవీ అప్పారావు రోడ్‌కు వెళ్లే దారిలో జాగృతి బ్లడ్ బ్యాంక్ జంక్షన్‌లో విద్యుత్ వెలుగులతో ఫౌంటైన్ నిర్మించారు. అయితే కొద్ది కాలం బాగానే పనిచేసింది. కానీ ఈ ఫౌంటైన్ నిర్మాణం జరిగి ఏడాది పూర్తి కాకమునుపే పనిచేయడం మానేయడంతో జంక్షన్‌లో చీకట్లు అలుముకున్నాయి. ఏడాది కాలానికే ఫౌంటైన్ పని చేయకపోవడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం ద్వారా చేపట్టకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి వాటర్ ఫౌంటైన్ మరమ్మతు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జగన్మాతా పాహిమాం

- గాయత్రీ మాతగా అమ్మవారి దర్శనం
- రెండో రోజు విశేషలంకరణలు
- కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

సీటీఆర్ఐ: శరన్నవరాత్రుల ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీచౌక్‌లో అమ్మవారిని గాయత్రీదేవిగా, ఉమామార్కెండేయ స్వామి వారి ఆలయంలో అమ్మవారిని మీనాక్షిదేవీగా, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అక్షింతుల అలంకరణ చేశారు. దేవీచౌక్‌లోని గాయత్రీదేవీ అమ్మవారిని దర్శించకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారికి పూజలు, మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. జేఎస్ రోడ్డులో శ్రీస్వర్ణ దుర్గ అమ్మవారిని కాళికామాతగా దర్శనమిచ్చారు. శుక్రవారం సాయంత్రం మంత్రి కందుల దుర్గేష్ దేవీచౌక్‌లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు శ్రీసత్యహరిచంద్ర నాటకం ప్రదర్శించారు.

పార్వతీమాతగా..

సీటీఆర్ఐ: స్థానిక బలరామపేటలోని కాశీవిశ్వేశ్వర స్వామి క్షేత్రంలో అన్నపూర్ణ అమ్మవారిని పార్వతీ మాతగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గుడివాడ మెహర్ ప్రసాద్ దంపతులు, వాక ముళ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

పూజలందుకున్న దుర్గమ్మ

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయి నగర్‌లోని విజయకనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కన్యకాపరమేశ్వరిగా అలంకరించినట్టు ఆలయధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే బాలాజీపేట సెంటర్‌లోని విజయకనకదుర్గాదేవి గాయత్రిగా దర్శనమిచ్చారు.

వైభవంగా కలశాల ఊరేగింపు

మోరంపూడి హనుమాన్‌నగర్‌లో దుర్గాదేవి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరి జలాల 108 కలశాలతో మహిళలు ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయం 108 కలశాలను దుర్గాదేవి అమ్మవారి ముందు ప్రతిష్ఠించి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో కోలాట నృత్యాలతో పురవీధుల్లో 108 కలశాలను చేతపట్టుకుని మహిళలు భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం 108 కలశాలలోని గోదావరి జలాలను అమ్మవారిని అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కడియం: మండలంలోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే ఆయా ఆలయాల వద్ద విశేష రీతిలో కుంకుమ పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కడియం దేవీచౌక్ సెంటర్‌లో జరిగిన పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. భారీగా హాజరైన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వర స్వామివారి ఆలయం, దుళ్లలోనిశారదా అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.





నగరంలోని దేవిచౌక్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న దంపతులు



గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన దేవిచౌక్ బాలా త్రిపుర సుందర దేవి



ఉమా మార్కండేయ స్వామి ఆలయంలో మీనాక్షీదేవి అలంకరణలో..



వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అక్షింతలతో అలంకారం



మోరంపూడి సాయినగర్‌లో కన్యకాపరమేశ్వరి అవతారంలో అమ్మవారు



కడియంలో పూజలు చేస్తున్న భక్తులు



జేఎన్ రోడ్‌లో స్వర్ణదుర్గ ఆధ్వర్యంలో కాళికామాతకు పూజలు



హనుమాన్‌నగర్‌లో కలశాలతో ఊరేగుతున్న మహిళలు

నగరం పరిశుభ్రం

కమిషనరు కేతన్ గార్గ్



క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పారిశుధ్య చర్యలను సక్రమంగా చేపట్టి పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. దసరా నవరాత్రులను పురస్కరించుకొని కోరుకొండ రోడ్డులో దుర్గమ్మ అమ్మవారిని నిలబెట్టిన పందిళ్లను పరిశీలించారు. టీ తాగిన కప్పులు సాయిబాబా గుడి పక్కన పడేస్తున్నారని, చెత్తకుండీలను పెట్టుకొని వ్యర్థాలను వాటిలో వేయాలని ఆదేశించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు కాబట్టి వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. పందిళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే మెడికల్ షాపులు ఇతర షాపుల యజమానులు వారి దుకాణాలను శుభ్రం చేసుకొని చెత్తను రోడ్డు మీద కాలువలలో పోస్తున్నారని హెచ్చరించారు. వినియోగించడంలో అందరు కంపాక్టర్లను డ్రైవర్లకు శిక్షణను యివ్వాలన్నారు. డ్రైవర్ల హాజరును పక్కాగా నిర్వహించాలని, విధులకు హాజరు కావడంలో ఆలక్ష్యం వహిస్తే చర్యలు తీసుకొంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అరోగ్య అధికారిణి డా.ఎ.వినూత్న, శానిటరీ సూపర్ వైజర్లు శ్రీనివాసరావు, ఖాసిం, రామలింగారెడ్డి, శానిటరీ ఇన్ స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీ దేవిని దర్శించుకున్న మంత్రి



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ: దసరా నవరాత్రులు సందర్భంగా దేవీచౌక్‌లో కొలువై ఉన్న బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారిని దర్శించుకొని ష్ట ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యవంతంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం గాయత్రీ దేవి అవతారంలో కొలువై ఉన్న అమ్మవారిని మంత్రి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనం అందజేశారు. కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.